# పరిపూర్ణత

సాంబాశి




అబల అయినా స్త్రీ సబల. సర్వ స్వమూ కోల్పోయినా మనుగడ సాగించగల గుండె దిటవు స్త్రీకి ఉన్నది. అహం దెబ్బతిన్నప్పుడు, సంపూర్ణత్వానికి లోటు వాటిల్లినప్పుడు పురుషుడు మాత్రం మనలేడు.

**కాలం** సుమారుగా క్రీస్తుశకం 202–208 మధ్య. దక్షిణాది రాజ్యాలు ఆంధ్ర కళింగాలు, మరికొంచెం లోపలికి వెళ్లితే చోళ పాండ్య చేర రాజ్యాలు. ఒక రాజ్యాన్ని మరొక రాజ్యం ఆక్రమించుకోవాలన్న ఆశ అన్నిటికీ సమానమే! అది ఒక నాటిది కాదు. ఆనాటికీ ఉంది. ఆనాటి ఆంధ్రానికి రాజు యజ్ఞశ్రీ శాతకర్ణి తర్వాతవాడైన విజయ శాతకర్ణి. అప్పుడు బాగా ఉన్నతిలో ఉన్నమతం బౌద్ధం. దానిని బాగా పోషించి వేల వత్సరాలకైనా నిల్వగల ప్రతిపత్తి నిచ్చినది శాతకర్ణులు. ఆర్యనాగార్జునుని తర్వాత నాగార్జున కొండలో బౌద్ధమతం పెద్దగా సాగరశ్రీ ఉంటున్నాడు.

ఒక ఉదయం.

వేగుచుక్క ఆకసానికి సాగి వస్తున్నది. చీకుచ చిక్కి ఉన్న లోకాన్ని చూచి చుక్కతో పాటు తూరుపు దిక్కు కూడా చిరునవ్వులొలక పోస్తున్నది. ఆ దరహాసంతో దంతరుచిలా ఉదయ కాంతి పుంజాలు ఉవ్వెత్తుగా ఎగ బ్రాకుతున్నాయి.

లోకం వెల్లబారడానికి దిక్కులు సరం జామా నేర్పరచు తున్నాయి. చీకు వెళ్ళిపోవ డానికి సామాను సర్దుకొంటున్నది.

సరిగ్గా ఆ సమయానికి చోళ రాజ్యం సరిహద్దు నుండి ఆంధ్ర సరగణాలోనికి మూడు సైంధవాలు ప్రవేశించాయి. ఆ మూడూ కొంత దవ్వు అలా వచ్చి ఇంక తెల్లవారుతున్నదని ఆగాయి. వాటిలో ఒకదానినుంచి ఒక మూర్తి

కిందికి దిగింది. ఆ మూర్తి తురగం దిగాక పరీక్షగా చూస్తే స్త్రీ. పోలికలు సరిగా తెలియడం లేదు. సైంధవాల మీదున్న యిద్దరూ దిగిన వ్యక్తితో "జాగ్రత్త. ఎలాగో మల్లినాథుని ప్రాపు సంపాదించి విషప్రయోగం చెయ్యాలి. ఏనాటి వార్త ఆనాడు వేగుల కందించు. వెళ్ళు. సక్రమంగా అవకాశం వినియోగించుకో" అని, ఆమూడవ గుర్రాన్ని కూడా అదిలించుకొని వచ్చిన బాటనే తిరిగి వెళ్ళిపోయారు.

లోకం తెల్లని కాంతి పుంజాలు పోసుకొని వెల్లబారుతున్నది. ఆ వెల్లబారే లోకానికి వస్తున్నాను అన్నట్టుగా అహస్కరుని సహస్ర కిరణాలు సరసర ప్రాకిపోతున్నాయి. ఆ కిరణాల లోనే కొన్ని కాలిబాటన వస్తున్న ఆమెమీద పడుతున్నాయి. ఆ పడ్డ కిరణాలు ఓడిపోయి నట్టుగా తిరుగు ముఖం పట్టాయి ఆ శరీర కాంతికి. ఆమెకు సుమారు ఇరవై ఏళ్ళు ఉండవచ్చు. ఆమె అవయవాల పొందిక చూచి ఉన్నట్లయితే ఆంధ్రశిల్పం అమరావతిలో మరో తీరుగా వచ్చి ఉండేది; గ్రీకు గాంధార శిల్పాంకే వన్నెదెచ్చి ఉండేది.

ఆమె సాధారణ వస్త్రాలు ధరించి ఉంది. ఆమె ఆ దుస్తులకు కూడా అందం, పొందిక, హుందా, విలువను అందించింది. సూర్యుడు ఆకసానా, ఆమె భూమిమీదా నడుస్తున్నారు.

ఆమె నగరు మధ్యకు చేరింది. భాస్కరుడు నడినెత్తికి చేరాడు. ఆకసాన సూర్యుని ఎవ్వరూ చూడలేక ఆమెమీదికి దృష్టులు కేంద్రీకరించారు. ఆమె వారి నెవ్వరినీ లెక్క చేయలేదు. ఆమె మోము ఎండకు బాగా కందిపోయింది. ఆమె దుకూలాలు చెమ్మను పీల్చి తడిసి ఇంక పీల్చలేకపోతున్నాయి. ఆమె సింహపురి కోటద్వారం సమీపించింది.

కావలివారు కంగారు పడ్డారు. ఆమె ఎవరో? ఎవరికోసమో? వారికి తెలియదు. ఆమెను ఆపడమా, మానడమా? అన్న సంశయం కలిగింది. ఆమె ఈ పట్టణ వాస్తవ్యురాలు కాదు. కోటలోని మనిషికాదు — అనుకొన్నారు, అందాన్ని కన్నుల త్రాగుతూ. కానీ వారి చేతుల ఈటెలు మామూలు కార్యక్రమాన్ని జరిపాయి. కొన్ని క్షణా లయ్యాక "ఎవరు నీవు? ఎవరికోసం?" అని ప్రశ్నించారు.

ఆమె రెండు ఈటెలూ తిక్కడిగా ఏర్పడగానే పై చెరుగుతో మదురు తుడుచుకొని ఒకసారి గాలి బాగా పీల్చి వదలి, "నాది ధాన్యకటకం. నేను దివాణంలోనికి వెళ్ళాలి" అన్నది.

"అనుమతి పత్రం?" అన్నా డొకడు.

రెండవవాడు, "ధాన్యకటకమైతే, పల్లకీ ఏదీ? దాసదాసీలేరీ? నీ వెవరి తాలూకు?" అని అడిగాడు.

"దారిలో దొంగలు దోచుకున్నారు. బోయీలూ, మిగిలినవారూ ఎటో పారిపోయారు. నేనుమాత్రం యిటు వచ్చాను. పత్రాలూ, నగలూ అన్నీ వారిపాల బడ్డాయి."

"అరే! చాలా కొత్తగా ఉందే! తెలుగు నాట

# పరిహృత

దొంగలు కొట్టడమా? ఆఁ అవన్నీ ఎందుకులే? నేను లోనికి వెళ్ళివచ్చేవరకూ ఉండు!" అని ఒక భటుడు కోటలోనికి వెళ్ళాడు.

ఒక డామెవంక చూస్తూ ఆలోచిస్తున్నాడు. ఈమె వాలకం చూస్తే ఏ రాణివాసం స్త్రీ లానో ఉన్నది. ఆపినందుకు, ఆ తర్వాత నా.... అత డాలోచిస్తూండగానే కోటద్వారం ముందు ఎందరో మూగారు. అందరూ ఆమెను చూడడం. ఎంత అందగత్తె! ఎవరో, ఎందుకు వచ్చిందో! ఎవరికి ఇష్టం వచ్చిన నిర్ణయం వారు చేసుకొని, ఎలాగైనా ఆడ కూతురును, అందులోనూ ఆమెను కోటగుమ్మం దగ్గర నిలవెయ్యడం తప్పు అన్న నిర్ణయానికి వచ్చేశారు.


అంతలో లోనికి వెళ్ళిన రాజ భటుడు తిరిగి వచ్చి ఆమెను వెంటబెట్టుకొని వెళ్ళాడు.

అత డామెను సరాసరి మల్లినాథుని సమక్షానికి చేర్చాడు.

మల్లినాథుడు సింహపురి సేనాపతి. సరిహద్దు రక్షక పదవిలో ఉన్నాడు. మంచి రూపసి. అతని కండలు తిరిగిన శరీరం కాంతివంతంగా ఉంటుంది. పొడగరి. అతని ముంజేతులు కండరాలు తిరిగి, ఆ కండరాలమీద నరాలు మెలిదిరిగి, చేవదేలిన సర్పాల్లా ఉన్నాయి. సన్నని కోర మీసం. ఆ మీసం ఆ ముఖాని కెంతో అందం తెచ్చింది. అతన్ని చూడగానే, మనిషంటే ఇలా ఉండాలి అనిపిస్తుంది. ఆమె అతన్ని చూచి 'ఇతనికా, నేను విషం పెట్టవలసింది?' అనుకున్నది.

వచ్చిన ఆమెను క్రిందినుండి పైదాకా చూచి ఈమె ఏ అంతఃపుర కాంతో, దారితప్పి ఇలా వచ్చింది అనుకున్నాడు మల్లినాథుడు. అనుకున్నా అతని మందిరం గాబట్టి "ఎవరు నీవు?" అన్నాడు అధికారం పొడకట్టే కట్టనట్టుగా.

"అనాథను" అన్నది ఆ అందాల రాశి. మాట



తరణం

చిత్రం—టి. వి. వి. వసంతరాయలు
(అనకాపల్లి)

లోనే అందించింది సర్వం. ఎంత జాణ కాకుంటే శత్రువుల కోటలోనికి ఒంటరిగా తోడులేకుండా సరాసరి ప్రవేశిస్తుంది! ఆమె అలా అనగానే తర్వాత ఏమి అడగాలో చప్పున తెలిసింది కాదు. క్షణం ఆలోచించవలసి వచ్చింది. మల్లినాథుడు తెప్పరిల్లి ఆమె సలాగే చూస్తుంటే అడుగవలసినవి మరచిపోతానేమో సనుకొని "కోట వాకిట దొంగలు కొట్టారని, ధాన్యకటకవాసినని చెప్పావుట!" అని అడిగాడు.

"అది వాస్తవమే!" అన్నదామె.

"ధాన్యకటకంలో నీవాళ్లెవరు? వాళ్లేం చేస్తుంటారు?" అని అడిగాడు.

"ఈనాడు వాళ్లెవళ్ళూలేరు. మొన్నటి వరకూ మేనమామ ఉండేవాడు. ఆయన చచ్చిపోయాడు. దిక్కులేక యిలా బయలు దేరాను. ఏదేశమైనా వెళ్ళి బ్రతకాలని ముందుగా ఇక్కడికి చేరాను" అంది జాలి గలిగేలా చూస్తూ.

మల్లినాథునికి ఏమీ తోచింది గాదు. ఆమెను క్రిందనుంచి పైదాకా చూచాడు. ఏదో ఆలోచన కలిగింది.

"నీవు బాగా ఎండలో పడచి వచ్చినట్లున్నావు. వెళ్ళి విశ్రాంతి తీసుకో. తర్వాత తిరిగ్గా మాట్లాడుకోవచ్చు వివరాలు" అని, ఒక పరిచారికను పిలిచి, "ఈమెక్కావలసిన వన్నీ చూడు" అన్నాడు.

పరిచారిక ఆమెను లోనికి వెంటబెట్టుకొని వెళ్ళింది. ఆమె వెళుతూ కృతజ్ఞతగా ఒక చూపు చూచింది. ఆచూపు మల్లినాథుని కెంతో బలం అందించింది.

ఒక సంధ్య—

మల్లినాథ సేనాపతి వద్ద ఆమె చాలా ప్రాపు సంపాదించింది. సింహపురిలో ఆమె పేరు అలక సుందరి. ఆమెను విడిచి క్షణం నిలువలేని స్థితికి వచ్చాడు మల్లినాథ సేనాని. తన మందిరంలో తనను కలుసుకోవాలని ఎవరైనా వస్తే ముందుగా అలక సుందరి అనుమతి పొందాలి. ఆమె కాదన్న కార్యం అతడు చేయడు. ఆమె కన్నులతో, అవయవాలతోనే చెపుతుంది. అతడు మాటతో దానిని బలపరుస్తాడు. కోటలో ఆమెకు తెలియనిదేదీ లేదు. రహస్య మందిరాలు, రహస్య ద్వారాలు అన్నీ తెలుసుకున్నది. ఏ క్షణాన్నయినా ఆమె వచ్చిన పని చక్క చేసుకోవచ్చు. కాని ఎందుకనో చేయలేదు. దాదాపు చేయలేని స్థితిలో ఉన్నది.

అప్పుడే మల్లినాథుడు ఎవరితోనో మాట్లాడడానికి అడిగి వెళ్ళాడు. ఆమె మందిరంలో నుంచి జారిపోతున్న సూర్యుని చూస్తున్నది. సగం కనిపిస్తున్నాడు అందంగా. చేతగాని చిత్రకారుడు రంగులు కలిపినట్టుగా ఉంది, పశ్చిమ దిశ. అలాగే నిలచి చాలాసేపు పరికించింది, ఆ అందాన్ని. తూరుపు నలుపు దిద్దుకు వస్తున్నది. లోకం మసకలో కప్పుకు పోతున్నది. ఆమె వెనుక అలికిడయింది. ఆమె

వెనుదిరిగి చూచింది. అలాగే స్తంభించి పోయింది. చిత్తరువులా మారిందామె, వెనుదిరిగి చూచిన క్షణం.

ఎదురుగా నిలిచిన ఆకారం "ఏం? వచ్చిన పని మరచి ఆనందంలో మునిగిపోయావా?" అన్నది. అలక సుందరి సమాధానమీయ లేదు.

"నీడలా నిన్నంటిపెట్టుకొనే ఉన్నారు. నీవు ఏక్షణం ఏం చేస్తున్నది తెలుస్తుంది. త్వరగా ముగించు!" అన్నది వచ్చిన ఆకారం.

ఆమె ఆమాట విని నవ్వింది.

"ఏమిటానవ్వు?" అన్నది ఆకారం శీత్కారంతో.

"నేను వచ్చినపనికోసం ఇంకా పునాదులు వేస్తున్నాను. అసలు రహస్యా లందలేదు."

"అన్నీ తెలుసుకున్నావు. మొన్న వారం నాడు రహస్య మందిరాలు సేనానితో తిరిగి చూచి రాలేదా? ఇంక మిగిలింది అతని హత్య. ఆఁ అది సరే. నీ దగ్గర నుంచి వేగులకు ఒక్క వార్త కూడా అందలేదు. కారణం?"

"నన్ను ఎవ్వరూ కలుసుకోనిదే ఎలా చెప్పటం?" అన్నదామె.

"ముగ్గురు వచ్చారు. ముగ్గుర్నీ మల్లినాథుడు బంధించాడు."

"ఆ విషయం నాకు తెలియదే!" అంది ఆశ్చర్యంగా.

"ఈ రాత్రికి అడిగి ఈ వారం పది రోజుల్లో వాళ్ళను విడిపించు!"

"అంటే దీనిని బట్టి నే నెవరో వారికి తెలుసన్నమాట!" అన్నదామె.

"తెలియదు. అదే యింకా ఈ కోటలో మిగిలిన సాయం. తెలిసిన మరుక్షణం నిన్ను మిగల్చడు. ఇతని అవసరం తీరుస్తున్నావని వాత్సల్యం చూపుతున్నాడు, జాగ్రత్త. నీ పని నెరవేర్చుకొని నీవు యిక్కడే ఉండు. సరిగ్గా వచ్చే పున్నమినాటి రేయి అతన్ని ఎలాగైనా కడతేర్చు. తెల్లవారగనే మన సైన్యం కోటను ముట్టడిస్తుంది. ఈ వేళ పాడ్యమి. సరిగ్గా పదిహేనవ నాటి రాత్రి. జాగ్రత్త. తప్పడానికి వీల్లేదు."

వచ్చిన ఆకారం దివ్వెలు వెలిగించడానికి వచ్చిన దాసీదాని కనుగప్పి వెళ్లి పోయింది. ఆమె ఆలోచనలో పడింది.

'నేను వచ్చినదెందుకు? చేసినది, చేస్తున్నది ఏమిటి? నా కర్తవ్యాన్ని మరచి పోయాను. ఎందువల్ల మరచిపోయాను? నన్ను మరపించిన దేమిటి? మల్లినాథుని మంచితనం. అత డెంత మంచివాడు! అతడు మనసిచ్చాడు. మనస్సు తీసుకొన్నాడు. అతన్నెలా మోసగించడం? అంత వాత్సల్యం చూపుతున్న వానికి విషం పెట్టడమా? ఎలా పెట్టగలను? అసలు నేను వచ్చింది అతన్నెలాగైనా చంపాలని కదా? ఎందుకూ అతన్ని చంపడం? ఎంత ఆనందాన్ని, ఎంత సుఖాన్ని, ఎంత వాత్సల్యాన్ని, ఎంత కరుణను, అందించాడు! అటువంటి మల్లినాథుని చంపడమా? అతన్ని చంపి బ్రతగ్గలనా? నా చావు ఎలాగూ తప్పదు. మల్లినాథుడు నాకు మేలు చేశాడుగాని కీడు చేయలేదు. పైగా తన సర్వస్వం ఇస్తానని కూడా అన్నాడు. నా వాణ్ణి నేను చంపడమంటే నా కన్ను నేను పొడుచుకోవడం. వీళ్లరాజ్య విస్తీర్ణతకోసం మల్లినాథుని చంపాలా? ఇంత సుఖం, ఇంత ఆనందం అందించే మల్లినాథుని చంపితే వాళ్ళు మొహరులిస్తారు. ఎన్ని వేలు, ఎన్ని లక్షల మొహరులైతే మల్లినాథుని అనురాగ మవుతుంది? వాళ్ళ పందలై, పారుబోతులై, ఎదుటబడి నిలచి గెల్వలేక కుట్రతో సాగించాలని మధ్య నన్ను పంపారు. నేను వచ్చి ఏం చేయగలిగాను? రహస్యాలైతే తెలిశాయి. అతన్ని నా అనురాగపు మత్తులో ముంచాను. అలా మునిగిన వాణ్ణి ఇవాళ హత్య చేయడమా? ఛాఛా! చేయలేను. అపకారం చేయలేను. ఆనందం అందించాడు. అందిస్తున్నాడు. చేజేతులా నాశనం చేసుకోను. అతనితో అనుభవం జీవితంలో ఒక్కనాడు తగ్గినా తగ్గినట్లే! అతని విశాల వక్షంలో బాహ్యంగా, అంతర్గతంగా నేను ఇమిడి పోయాను. అతని బందీని. ఈ బంధనం నాకు దాస్య సంబంధమైనది కాదు. ఆనందదాయకమైనది. దీనిని నే నెందుకు ఛేదించుకొని సాగిపోవాలి? వెళ్ళను, వెళ్ళలేను, వెళ్ళకూడదు.

అసలు వీడెవడు? వీడు వచ్చి మల్లినాథుని అంతఃపురంలో, అందులో మల్లినాథ సేనాని హృదయాన్ని శాసిస్తాడా? పైగా గడువు పెడతాడా? ఈ కోట మల్లినాథునిది. మల్లినాథుని సర్వస్వం నేను. నన్ను చూస్తూ నాకా వాడు గడువు పెట్టేది? మల్లినాథసేనానే నన్ను శాసించలేదు. వీడా? తను చాలా మొరటువాడని, బలం గలవాడినని వాని భావం. చేతకాక నన్ను పంపారన్నది మరచిపోయారు. వాడికన్న బలం, వాడికన్న గుండెలు కండలు దేరిన మల్లినాథుడే నన్ను కాదనలేదు. నన్ను తీసం చేసుకొన్నాడు. వాడినీక్షణం ఏం చేస్తేమాత్రం కాదనగలవారున్నారు? ఎవరు వీణ్ణి రక్షించేది?'

ఆమె ఆమాట అనుకోగానే, ప్రాణానికెంతో హాయనిపించింది. ఆమె ఒక నిర్ణయానికి వచ్చింది. ఎదురుగా దివ్వెలు వెలిగించుతున్న పరిచారికను పిలిచింది. పరిచారిక దగ్గరకు రాగానే ఏదో చెప్పింది. ఆమె వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిన రెండు మూడు క్షణాల్లో ఇద్దరు దీర్ఘకాయులు వచ్చి మోకరిల్లారు. ఇద్దరినీ చూస్తూ, "ఇప్పుడు వచ్చి వెళ్ళినది మన వేగనేగా మీ భావం? కాదు. మనమీద పని చేస్తున్న వాడు. చప్పున వెళ్ళి అతని సంగతి చూడండి. ఉద్యానవనంలో అక్కడి ప్రక్క చెట్టు క్రింద పాడి శవం చేర్చండి" అంది.

ఇద్దరూ వెళ్ళిపోయారు,

వాడివాళ్ళతోనే వాడిప్రాణాలు తీయాలి, ఇక ఈ యిద్దరుమాత్రం శేషంగాదేనికి?వాళ్ళనూ వదలించుకొంటే పోయింది, అనుకుంది వాళ్ళ వెళ్ళాక.

ప్రొద్దు వాలిపోయింది. ఉద్యానవనం దొడ్డిత్రోవగా చీకటిలో కొంత మంది మూడు కళేబరాలను మోసుకొని దూరంగా ఉన్న పెన్నానదిలో కలిపి వేశారు. ఆరాత్రి ఆమె హాయిగా నిద్రపోయింది.

ఒక పున్నమి రేయి—

వెన్నెల కన్నుల పండువు చేస్తున్నది. వనంలోని కొలనులో తామర పూవులు గాలికి తలలూపుతున్నాయి. వాటికాధారమైన కాడలు నీళ్ళకు వలయాలు దిద్దుతున్నాయి. ఆనీళ్ళలో నిండు చంద్రుడు మెలికలు తిరిగి పోతున్నాడు.

ఒకచోట నాలుగు చెట్లు దగ్గర దగ్గరగా ఉన్నాయి. ఆ నాలుగు చెట్లకూ మాలతీ జాజుల తీగెలు అల్లుకొని ఉన్నాయి. ఆ అల్లుకోవడం ఒక చెట్టు కొమ్మ నుంచి మరోచెట్టు కొమ్మకు అల్లుకోవడం వలన పందిరి వేసినట్లున్నది. ఆ పందిరంతా తెల్లగా పూవులు విరబూసి తెల్లగా వెన్నెలను వెక్కిరించడానికి ప్రయత్నించినట్లుగా, పందిరి దంత కాంతి కాబోలన్న తీరుగా ఉన్నది. క్రింది పందిరికి జడిసి ఆకసాన చంద్రుడు పారి పోతున్నట్లుగా అనిపిస్తున్నది.



గోపికాలోలుడు

చిత్రం—బి. వి. సుబ్బయ్య (పెద్దపసుపుల)

ఆ నాలుగు చెట్ల మధ్య వెన్నెలలేదు వానకు వెన్నెల ఆవనం గొడుగు పట్టుతున్నదా అన్నట్టు అక్కడ చీకటిగా ఉన్నట్లున్నా నాల్గు ప్రక్కల వెలుగూ కొంచెం కొంచెంగా అరువిచ్చినట్లుగా ఆకారాలు కనిపించేంత కాంతి ఉంది.

ఆ మధ్య ప్రదేశంలోనే పాలరాతి అరుగుఉన్నది. ఆ అరుగు మీద ఒక స్త్రీ మూర్తి కూర్చుంది. ఆమె ఊరువుల మీద ఒక బలమైన పురుషాకారం తలమోపి కలతనిదురలో ఉంది. కండలు దేరిన ఆ శరీరానికి అంతా తెలుస్తుంది.

ఏమీ తెలియదు. తనెవరో తెలియదు. తనంతా ఆ స్త్రీ మూర్తే నమకొంటుంది. ఒడిలో ఉన్న ఆ శరీరాన్ని, కాంక్షతో, శాంతతో, తృప్తితో, శ్రమతో, ఆనందంతో, అనురాగంతో గోముగా తన తీవ చేతులతో రాస్తూ

# పరిహృత

తన్మయావస్థలో ఉంది.

ఆ రెండు ఆకారాలూ అలా ఆ పాలరాతి తిన్నెమీద వెన్నెల గొడుగులో ఏ అనంతానంద సాగరంలోనో కొట్టుకు పోతుండగా, ప్రక్కనున్న మొదలుదగ్గర ఒక పురుషాకారం నిలచి పరీక్షగా చాలాసేపు చూచి మాలతి ఆకులు తుంచి ఉండగా మడచి ఆ ఉండతో స్త్రీ మూర్తిని కొట్టింది గురిచూచి. ఆ ఉండ బంతిలా మెత్తగా సద్దురాకుండా ఆమె వెన్నుకు తగిలింది. ఆమె వెను దిరిగి చూచింది. ఆమె గుర్తించింది. గుండెలు వేగంగా కొట్టుకొన్నాయి. ఒక్కసారి ముచ్చెమటలూ పోసినట్లయి, స్తంభించి తిరిగి క్షణాల్లోనే తేరుకొని, ఉండు అన్నట్లు చేతితో సైగ చేసింది. వెనుక ఉన్న పురుషాకారం అలాగే నిలిచి ఉంది.

కొన్ని లిప్తలయ్యాక మెల్లగా స్త్రీ ఆకారం ఊరువుల మీది పురుషాకారం తాలూకు తలను మెల్లగా క్రిందకు జరిపి సవ్వడి కాకుండా లేచి చల్లగా, మెల్లగా, నాజూకుగా, నడచి చెట్టు మొదట ఉన్న పురుషాకారం దాపుకు వెళ్ళింది.

ఆకారం ఆమెను దాపుకు వచ్చాక, "ఇంకా నీ పని పూర్తి చేయలేదా? నీకు పంపిన వార్త అందలేదా?" అనడిగింది.

"ఏవార్త? ఏమని?" అని ఆశ్చర్యంగా అడిగింది స్త్రీ ఆకారం.

"పున్నమికంతా సిద్ధం చేయమని?"

"నాకేమీ తెలియదే?"

"వాడేమయ్యాడు?"

"ఎవరూ? ఏమిటి? నాకయోమయంగా ఉన్నది!"

"పక్షం క్రితం ఒక వేగుచేత వార్త పెట్టాము. ఇవాళ రాత్రికి సెన్నదాటి వస్తాము. ఆ రాత్రికి అంతా సరిచేసి ఉంచవలసిందని."

"అరెరే, నాకేమీ అందలేదే! ఇంతకూ మన సేన సెన్న దాటిందా?"

"ఈ పాటికి దాటుతూ ఉంటారు. ఆ: నేను వెళ్ళిపోతాను. ఇది మంచి అదనే. వాణ్ణి సావు చెయ్యి. వాడు నీ వలలోనే ఉన్నాడు. అదొక సంతోషం. పూః కానీ!"

"అదెంత పని? నీ వెటునుండి వచ్చావు లోనికి?"

"మూడో ద్వారంలో పహరావాణ్ణి చంపి వచ్చాను."

"మరి ఎటునుండి వెళతావు?"

"అటునుండే."

"అటునుండా? మరో ప్రహరావాడు మారి ఈపాటికి రగడగా ఉంటుంది. ఇటుగా వెళ్దువుగాని రా. మరో మార్గం చూపుతాను. నీ దగ్గర కైజారున్నదా?"

"ఉంది. ఎందుకు?"

"అదిటివ్వు. తిరిగి లోనికి వెళ్ళి కత్తి తెచ్చే వ్యవధి లేదు. నీవు వెంటనే వెళ్ళి మన సేనను సెన్న దాటమను. ఈలోగా ఇతని పని చూస్తాను" అని ఆ స్త్రీ ఆకారం ఆ పురుషుణ్ణి చెట్ల నీడల్లో అటూ ఇటూ త్రిప్పుకొని బాగా వెన్నెల పడని చీకటి చోటుకు చేర్చి, "అదిగో ఆ లోనికి వెళ్ళు. అక్కడ ఒక తలుపుంటుంది. ఆ తలుపులు తెరచుకొని వెళితే వెలుపల పడతావ్" అన్నది.

పురుషాకారం రెండడుగులు వేసింది. అతడిచ్చిన కైజారును చివాలున అతని వెన్నుకు నాటింది. "అబ్బా! ఎంత మోసం!" అని ఎదురు తిరిగాడు. తిరిగి గుండెల్లో ఒక పోటు పొడిచి కైజా రలాగే వదలి వెనుకకు అడుగు వేసింది. పురుషాకారం అలాగే నేల కొరిగిపోయింది.

(తరువాయి 56 వ పేజీలో)

యువతులు - యువకులు

పెండ్లికాని యువతులు, యువకులు వారి వివాహ సమస్య పరిష్కరించుకొనుటకు రు. 2—75 న.పై. పంపుట ద్వారా దరఖాస్తు ఫారం పొందండి. దరఖాస్తు ఫారం మాకు చేరగనే తగిన వివరములు, ఫోటోలను పంపగలము.

సోషల్ సర్వీసెస్.
(డిపార్టుమెంటు) మేరేజ్ సెటిలర్స్
మత్స్యపురి, ప. గో. ఆంధ్ర.

మీ అలంకారమునకు




నీపా

ఎ. కె. ఎస్. & కంపెనీ.
అడయార్, మద్రాసు-20

EP AKS 2

లాభదాయకమైన లఘుపరిశ్రమ ప్రారంభించండి

"అధునాతన కుటీరపరిశ్రమలు" (తెలుగు) పుస్తకంలో లాభదాయకమైన వివిధ పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమలలో ఉన్నవారు చక్కటి లాభాలను ఆర్జిస్తున్నారు. ప్రతి పరిశ్రమనుగూర్చి సంక్షిప్తమైన వివరాలు, ముడిపదార్థాలు లభించేచోట్లు, ముడిపదార్థాల కొనుగోలుకు, వాయిదాల పద్ధతిన యంత్రాల కొనుగోలుకు ప్రభుత్వం యిచ్చే సహాయం—ఇందులో ఉన్నాయి. లఘుపరిశ్రమలు ప్రారంభించదలచుకున్న వ్యక్తుల సమస్యలకు తగిన పరిష్కారమార్గాలు ఇందులో ఉన్నాయి. పుటలు 878, సుమారు 300 బొమ్మలు, ధర రూ. 13. తపాలా రుసుం రూ. 1—61. ఫోన్ నం: 229835.

**COTTAGE INDUSTRY, (AWN-12) P.B. 1262, Jamuna Road Delhi-6.**

ఆ స్త్రీ ఆకారం వెన్నెలలోనికి వచ్చి ఏమీ తెలియనట్టు, జరగనట్టు తన చీరెను ఒకసారి క్రిందనుండి పైదాకా వెన్నెల వెలుగులో చూచుకొని, నిండుగా గుండెల్లోనికి గాలి పీల్చుకొని వదలి, నడచి మెల్లగా ఆ నాలుగు చెట్ల మధ్య పాలరాతి వద్దకు వచ్చింది. క్రింద పరుండబెట్టిపోయిన ఆకారం ఒత్తిగిలి ఉండడం చూచి తల నొకసారి కదలించి కూర్చో బోయింది.

ఆకారం లేచి నిలబడింది చివాలున. వికారంగా నవ్వింది. ఆ నవ్వు, ఆ పకపక విష పూరితం. ఆమెకు కంపరం కలిగింది. పెదవులు తడారి పోయాయి. హఠాత్తుగా ఏదో తలపుకు వచ్చి వాల్గ వంకలా పరికించి నిట్టూర్చింది. ఆ నవ్వు మల్లినాథునిది కాదని ఆమె ముందుగానే తెలుసుకుంది.

"అపురుషాకారం"ఇదా నీవు చేస్తున్న పని? వచ్చిన వారిని వచ్చినట్లు నమ్మించి మట్టు పెట్టి మల్లినాథునితో కులుకుతున్నావా?" అన్నది క్రౌర్యంతో.

స్త్రీ ఆకారం ఈలోపల ధైర్యం చిక్క బట్టింది. ఆ ధైర్యానికి అంతూ పంతూ లేదు. ఎంతో బాధలో, ఏమీ చేతగాని స్థితిలో, గత్యంతరం లేని పరిస్థితిలో వచ్చే మొరటు ధైర్యం అది. అది సాహసం. ఆ సాహసాన్ని ఈ లోకం ఎప్పుడూ భరించ లేదు. ఈ లోకం ఆ తెంపరితనానికి చాలదు. ఆమె బాగా గురి తీసుకొని మాటకూ మాటకూ వ్యవధిస్తూ తాపీగా చెప్పడం మొదలుపెట్టింది.

"ఔను. పందలై ఒక వీరుని, ఒక శౌర్య వంతుని, ఒక ధైర్యవంతుని హత్య చేయమని, అందులోనూ వ్యామోహంలో ముంచి వంచించి, మోసగించి చంపమని పంపారు. నే నా పని చేయలేకపోయాను. కారణం? మీ రిచ్చే పారితో షికం అతడు నా కందించిన సుఖం కన్న చాలా తక్కువైనదని తెలిసింది. ఆ చోళరాజ్యం, ఈ ఆంధ్రరాజ్యం రెండూ కలిపి నాకు పట్టం కట్టినా, అత డిచ్చిన ఒకరేయి అనుభూతి ముందు ఎందుకూ కొరగాకుండా పోతాయి. ఆ ఆనం దానికి మేరలేదు. దానికి పరితూగగల దీ లోకంలో లేదు. అది అందుకోవడానికి బ్రతికిఉన్నాను."

"ఇంకా ఏ మందుకొంటావు?"

"అతన్ని చంపేశావా?"

"ఈ పాటి కైపోయి ఉంటుంది."

"ఆ!"

"అతనికొరకు దిగులు దేనికి? నీ విషయం చూడు."

"నా విషయాన్ని గురించి నా కెప్పుడూ బెంగ లేదు. ఆ బెంగగానీ, బెరుకు గానీ ఉంటే నే నీ కార్యానికి ఒప్పుకునే దానిని గాదు. నీ

# పరిహృత

( 3వ పేజీ తరువాయి)

వెందుకు వచ్చినట్టు?"

"నీ విషయం అనుమానం తగిలి, వాణ్ణి నీతో ముందుగా మాటాడమని వాడి మీద కాపుగా నేను వచ్చాను. ఐనా నీ పని నీవు పూర్తి చేశావు. అదెవరా వచ్చేది?" అని అటు చూస్తుండగా చుట్టూ సైనికులు నిలిచారు. మల్లినాథుడు ప్రక్క చెట్టు చాటు నుండి వెలికి వచ్చి, "బంధించండి వాణ్ణి" అన్నాడు.

"ఆఁ నీ వింకా బ్రతికే ఉన్నావా?" అన్నాడు వచ్చిన వేగు.

"నా బదులు వాడు వెళ్ళిపోయాడు."

"నన్నుకూడా బంధించండి సేనానీ!" అన్నది స్త్రీ ఆకారం.

"తప్పదు అలకా! ఐనా ఆలోచిస్తాను. ఆలోచించి ప్రయోజనం ఉండదు. మనస్సులు వేరు. మన సంబంధాలు వేరు. రాజనీతులు వేరు. చేయాలని వచ్చిన దోషం చేయలేకపోయినా నీవు దోషివే! నీవు వచ్చిన పని మరచినా, నీవు నా కిచ్చిన సౌఖ్యం, మన సఖ్యం మరచి పోలేం. అలకా, వెళ్ళు. లోనికి వెళ్ళు. నన్నాలో చించుకోనివ్వు."

"ప్రభూ! బాధ పడకండి. రాజనీతినే కొనసాగించండి."

"అలకా, నీవు వచ్చిన ఆశయం నెరవేర్చు కొనున్నా నా కింత బెంగ కలిగేది కాదు. ఈ బాధ నేను భరించలేను. ఏనాడైనా మాచాయగా నైనా తెలియచెప్పిఉంటే నిన్నింత నన్ని హితంగా రానిచ్చేవాడిని కాదు. నీవు ద్రోహం చేయవు; చేయలేదు; చేయలేవు. కానీ, దోషివి అలకా, దోషివే! నన్ను ఆలోచించుకోనీ. వెళ్ళు. నిన్ను చంపలేను. నీవు నన్ను చంపినా బాధ లేదు. ముందు నీవు వెళ్ళు" అన్నాడు.

ఆమె అలాగే నిలబడి ఉంది. అతడు మెల్లగా పాలరాతి మీద కూలబడ్డాడు. ఆమె కన్నీళ్ళతో నిండిన చెక్కిళ్ళను అతని పాదాలపై ఆనిం చింది.

ఆ తర్వాత ఆమెను దగ్గరకు తీసుకొని, లోనికి తీసుకొని వెళ్ళాడు. మందిరంలో వదలి, పెన్న దాటుతున్న సైన్యాన్ని ఎదుర్కొన డానికి సర్వసైన్యాల్ని సమకూర్చుకొని ఎదురు వెళ్ళాడు. అతని మతి మతిలో లేదు. కాని కర్తవ్యం అతని శరీరాన్ని నడిపించింది.

చోళాంధ్ర సైన్యాలు తల పడ్డాయి. పోరు ఘోరంగా సాగింది. ఆయుద్ధంలో మల్లి నాథుని కుడి భుజం తెగిపోయింది. వెనుక పాటుగా కావాలని అక్రమంగా పోరాటం సాగించి ఒంటి వాణ్ణిగా చేసి చోళ సైన్యం సింహపురి కోటను ఆక్రమించుకోబోయింది. అంతలో విజయ శాతకర్ణి సర్వ సైన్యంతో వచ్చి, చోళదేశంలోని కొంత పరగణాతనదిగా చేసు కోవడం జరిగింది.

అది విజయ శాతకర్ణి పరిపాలించిన ఆరు వత్సరాల్లో ఘోరమైన సమరం. అంతకు ముందు నాటిపోయిన నాగార్జున బీజాల మొలక లను చోళులు గిల్లివేశారు. తిరిగి యుద్ధాలు మొదలయ్యాయి ఆనాటి నుండి.

ఆనాటి సమరంలో గాయాలు తగిలిన వారందరినీ నాగార్జున కొండ చేర్చారు. వారి లోనే మల్లినాథుడు కూడా ఉన్నాడు.

మల్లి నాథుని విడువకుండా అంటి పెట్టు కొని పరిచర్య చేస్తున్న అలక సుందరిని అంద రూ మల్లినాథుని భార్యగానే భావించారు. సాగరశ్రీ అలాగే అనుకున్నాడు, ఆ పరిచర్యకు అచ్చెరువు పొందుతూ.

ఒక మధ్యాహ్నం—

చేయిలేని అవిటి బ్రతుకుబ్రతకలేనని మల్లి నాథుడు ఆత్మ హత్య చేసుకొన్నాడు. అది వచ్చి చూచి అలక సుందరి, కృష్ణలో దూకింది. ఆమె దూకడం చూచిన సాగరుని శిష్యులు, శ్రమణులు ఒడ్డుచేర్చి పరిచర్యలు చేశారు. ఆనాడు సాగరశ్రీకి తెలిసింది. చంపడానికి వచ్చి చంపలేక అతని చావుతో ఆమె చావ చూచిందని.

ఆమె కనులు విచ్చి "నేనెక్కడున్నాను? బ్రతికి ఉన్నానా?" అన్నది దిగులుగా.

"విరహంలో చచ్చిపోయావు బిడ్డా. వేదనను కాలదన్నావు బ్రతికిపోతావ్" అన్నాడు, సాగరశ్రీ ఎదురుగా నిలిచి ఆమెను చూస్తూ.

"నేను బ్రతకడం దేనికి?" అని అడిగింది అలక సుందరి.

"చావుకోసం. బ్రతికిన వారికి సేవ కోసం."

"నా మల్లినాథుడు?" అని ఏడ్చిందామె.

"అతడు వెళ్ళిపోయాడు. అతని మరణం నీకు వ్రణం కాకూడదు. చంపలేనని తెలుసు కున్నదానవు చావలేనని తెలుసుకోవాలి."

"నేను బ్రతకడమెందుకు?"

"ధర్మం కొరకు."

"నే నెందుకు చావకూడదు?"

"సంఘం కొరకు."

"నాకెంతో బాధగా ఉంది."

"భరించి బ్రతికితే బుద్ధి తెలుస్తుంది."

"మల్లి నాథుడు చచ్చి పోయాడేం?"

"అతడు చేతగాని వాడు. నీవు చేతనైన దానవు కాబట్టే అతన్ని బ్రతికించ ప్రయ త్నించావు. బాధకు శాంతి ఆత్మార్పణం గాదు, భరించడమే." ★

Printed and Published by S. V. Swamy B.A., on behalf of Andhra Prabha Ltd. and Printed at Dinamani Press, Mount Road, Madras and Published at Gandlapalli, Chittoor. Editor: Neelamraju Venkataseshaiah.